నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 నల్లగొండ, శుక్రవారం 10 జనవరి 2025 NALGONDA

## మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన ఆలేరు నాయకులు



మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన ఆలేరు నాయకులు

ఆలేరు టౌన్, జనవరి 9 : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ఆలేరు నాయకులు గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఆలేరు మండలాధ్యక్షుడు గంగుల శ్రీనివాస్ యాదవ్, బహుదూర్‌పేట మాజీ సర్పంచ్ జంపాల దశరథ, బీసీ సెల్ యాదగిరిగుట్ట మండలాధ్యక్షుడు మహేందర్ ఉన్నారు.



సూర్యాపేటలో బైక్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

## రోడ్డు భద్రత నియమాలు విధిగా పాటించాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్
- సూర్యాపేటలో బైక్ ర్యాలీ

సూర్యాపేట టౌన్, జనవరి 9 : ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను విధిగా పాటించాలని కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్ద బైక్ ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ బుల్లెట్ బండిపై కొత్త బస్టాండ్ వరకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో ప్రాణాలను కాపాడుకునేందుకు హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది నిండు ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బైక్ డ్రైవింగ్‌లో హెల్మెట్ వాడితే 90 శాతం వరకు ప్రాణాపాయం బయట పడొచ్చన్నారు. అనంతరం టూ వీలర్స్ అసోసియేషన్ అందజేసిన హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వర్‌రావు, ఆర్డీఓ సురేశ్‌రెడ్డి, ఎంవీఐలు జయప్రకాశ్‌రెడ్డి, ఎ.ఆదిత్య, ఏవీఐలు సతీశ్ కుమార్, విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు.

# తులం బంగారం ఏమాయె..

## కల్యాణలక్ష్మిలో బంగారం ఇస్తామన్న కాంగ్రెస్

### శుభలేఖతో దరఖాస్తు చేసుకుంటే పెండ్లికి ముందే అని హామీ..

### ఏడాది గడిచినా అమలుకు నోచని పథకం

### సూర్యాపేట జిల్లాలో ఇప్పటివరకు 33.62 కిలోల బంగారం బాకీ




**అసెంబ్లీ ఎన్నికల్లో అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఏడాది దాటినా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం లేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పేదింటి ఆడబిడ్డల పెండ్లికి లక్షా నూట పదహార్లు అందించి నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా నిలవగా, తమకు అధికారం ఇస్తే అందుకు అదనంగా తులం బంగారం ఇస్తామన్న రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఆ మాట కూడా ఎత్తడం లేదు. పెండ్లికి ముందే లగ్నపత్రిక చూయించి దరఖాస్తు చేసుకుంటే కల్యాణలక్ష్మి నగదు సాయంతోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పి మోసం చేయడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. ఏడాది కాలంలో సూర్యాపేట జిల్లాలో 5,520 వరకు వివాహాలు జరుగగా 3,362 మందికి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఇచ్చినట్టే కల్యాణలక్ష్మి నగదును అందించారు. ఇందిరమ్మ కానుకగా ఇస్తామన్న బంగారం మాత్రం మరిచారు. ఇలా ఇప్పటి వరకూ జిల్లాలో 33.62 కిలోల బంగారం సర్కారు బాకీ పడింది.**

– సూర్యాపేట, జనవరి 9 (నమస్తే తెలంగాణ)

ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు, అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటి అమలులో మాత్రం చిత్తశుద్ధి చూపించడం లేదు. తెలంగాణ ఉద్యమ సమయంలో అన్ని వర్గాల బాధలను చూసి చలించిన ఉద్యమ రథసారథి కేసీఆర్.. స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి అయ్యాక జనం అడగకున్నా వారి అవసరాలు తెలుసుకుని అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చారు. అందులో ఒకటి కల్యాణలక్ష్మి, షాదీముబారక్. పేదింటి ఆడబిడ్డల పెండ్లి తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతో సర్కారు నుంచి రూ.లక్షా ఒక వేయి నూటపదహారు రూపాయలు అందిస్తూ వచ్చారు. అలా అనేక కుటుంబాలను అప్పుల గండం దాటించారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల సమయంలో అడ్డగోలు హామీలిచ్చిన కాంగ్రెస్.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు పెండ్లికి ముందే తులం బంగారం అదనంగా ఇస్తామని ఊదరగొట్టింది. కానీ, అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా నేటికీ ఆ పథకం ఊసే ఎత్తడం లేదు. 2024 జనవరి నుంచి ఇప్పటివరకు సూర్యాపేట జిల్లాలో దాదాపు 5,520 వివాహాలు జరిగాయి. అందులో 3,362 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వారికి కేసీఆర్ హయాంలోనే ఇచ్చినట్టు లక్షా నూట పదహార్ల చెక్కు మాత్రమే ఇచ్చారు తప్ప బంగారం ఇవ్వలేదు. అలా ఒక్క సూర్యాపేట జిల్లాకే కాంగ్రెస్ ప్రభుత్వం 33.62 కిలోల బంగారం బాకీ పడింది. మరోవైపు మిగిలిన దరఖాస్తుదారులకు రావాల్సిన నగదు కూడా ఇంకా పెండింగ్‌లోనే ఉంది. సర్కారు మోసపూరిత వైఖరిపై మండిపడుతున్న లబ్ధిదారులు ఎన్నికల హామీ మేరకు తులం బంగారం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.



**బంగారం లేదు..**
**కల్యాణలక్ష్మి చెక్కూ ఇయ్యలేదు**

నా బిడ్డ పెండ్లి చేసి సంవత్సరం అయ్యింది. ఇంతవరకు తులం బంగారం ఇవ్వలేదు. కల్యాణలక్ష్మి చెక్కు కూడా రాలేదు. పెండ్లి కోసమని చేసిన అప్పులకు వడ్డీ పెరుగుతున్నది. ప్రభుత్వం తులం బంగారం ఇస్తే అదనంగా ఇంకో తులం ఇస్తమని మా అల్లుడికి మాట ఇచ్చినం. ఏడాదైనా రాకపాయె. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుని మాలాంటి పేదోళ్లను ఆదుకోవాలి.

**-పరాల సైదమ్మ, గుంజలూరు(చివ్వెంల మండలం)**



చౌటుప్పల్‌లో ట్రిపుల్ ఆర్ నిర్వాసితు రాస్తారోకోను అడ్డుకుంటున్న పోలీసులు

## ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాల్సిందే

- చౌటుప్పల్‌లో బాధిత రైతుల ధర్నా.. రాస్తారోకో
- పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం

చౌటుప్పల్, జనవరి 9 : రీజినల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న నిర్వాసితులు గురువారం చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. చౌటుప్పల్, వలిగొండ మండల్లాలోని వివిధ గ్రామాల రైతులు తరలివచ్చి ధర్నా చేశారు. పోలీసులు భారీగా మోహరించి, రైతులు కార్యాలయం లోపలికి వెళ్తుండగా అడ్డుకున్నారు. కాగా, తాము ఎప్పుడు వచ్చినా ఆర్డీఓ వీ.శేఖర్‌రెడ్డి కార్యాలయం ఉండడం లేదని రైతులు మండిపడ్డారు. కావాలనే ఆఫీసుకు రావడం లేదని ఆరోపించారు. 'మా భూములు మాకు కావాలి. కన్నతల్లి ముద్దురా.. ట్రిపుల్ ఆర్ వద్దురా. ప్రాణం పోయినా సరే భూములు ఇవ్వం' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎన్నో రోజులుగా తాము నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం మండిపడ్డారు. అటవీ భూములు పోతే పర్యావరణ పరిరక్షణ కోసమని రెండింతలు భూమి ఇచ్చే ప్రభుత్వం రైతులను పట్టించుకోదా అని ప్రశ్నించారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రభుత్వం తమ ఉద్యమాన్ని అణిచివేయడం సరికాదన్నారు. ఆర్డీఓ శాఖాపరమైన పని మీద కలెక్టరేట్‌కు వెళ్లారని ఉద్యోగులు చెప్పడంతో డీఈఓ శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం అక్కడి నుంచి 65వ జాతీయ రహదారిపైకి చేరుకుని కొద్దిసేపు రాస్తారోకో చేశారు. పోలీసులు రాస్తారోకోను కూడా అడ్డుకోగా, వాగ్వాదం జరిగింది. కార్యక్రమంలో భూ నిర్వాసితుల ఐక్య వేదిక కన్వీనర్ చింతల దామోదర్‌రెడ్డి, నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, దబ్బేటి రాములుగౌడ్, దశరథ గౌడ్, గుజ్జుల సురేందర్‌రెడ్డి, మారుపాక లింగం గౌడ్, చింతల ప్రభాకర్‌రెడ్డి, సందగళ్ల మల్లేశంగౌడ్, జాల వెంకటేశం యాదవ్, జాల జంగయ్యయాదవ్, గుండెబోయిన వేణుయాదవ్, వల్లూరి బోగయ్య, ఎసిరెడ్డి దామోదర్‌రెడ్డి, బొమ్మిరెడ్డి ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



చిట్యాలలో సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద పత్తి లోడ్లు

## సీసీఐ సెంటర్లు ఎత్తేస్తున్నరు

- ఉన్నఫళంగా బంద్ చేయడంతో పత్తి రైతుల అవస్థలు
- ప్రణాళికాప్రకారమే ఒక్కొక్కటిగా మూత
- పంటను ఎక్కడ అమ్ముకోవాలో తెలియక రైతుల పాట్లు
- ఒక్క మిల్లుకు వెళ్తే రెండు మిల్లులకు తిప్పుతున్న అధికారులు
- గతంలో జనవరిలో ఎన్నడూ బంద్ పెట్టలేదంటున్న రైతులు
- చిట్యాలలో ఆందోళన

చిట్యాల, జనవరి 9 : ఆరుగాలం కష్టపడి పండించిన పత్తిని మార్కెట్లో అమ్ముకునేందుకు రైతులు అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది. నిన్నమొన్నటి వరకూ నాణ్యత లేమి, తేమ పేరుతో కొర్రీలు పెట్టిన సీసీఐ కేంద్రాలు ఇప్పుడు ఉన్నఫళంగా కొనుగోళ్లు బంద్ చేసి రైతులను రోడ్డున పడేస్తున్నాయి. రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఒక్కొక్కటిగా సీసీఐ సెంటర్లను బంద్ చేస్తుండడంతో పత్తి లోడ్లతో వచ్చిన రైతులు పంటను ఎక్కడ అమ్ముకోవాలో తెలియక రైతులు అవస్థ పడుతున్నారు. వాస్తవానికి పత్తి ఎన్ని రోజులు వస్తే అన్ని రోజులు కొనుగోళ్లు చేపట్టాలని నిబంధన ఉన్నప్పటికీ ఆ నిబంధనలకు అందుకు విరుద్ధంగా అధికారులు ముందస్తుగానే కేంద్రాలను మూసేస్తున్నారు. గతంలో ఫిబ్రవరి వరకు నడిచిన సెంటర్లను ఇప్పుడు జనవరి రెండు వారంలోనే బంద్ పెడుతున్నారు. ఓ కేంద్రంలో నాణ్యత లేని పత్తి కొనుగోలు కారణంగా ఒక అధికారిపై చర్యలు తీసుకున్నారని, పత్తి తేవడం తగ్గిన కేంద్రాలను ఎంపిక చేసుకొని ఒక్కొక్కటిగా మూసేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారని సీసీఐ అధికారి ఒకరు తెలిపారు. కాగా, కొనుగోలు కేంద్రాలను మూసి వేసే ముందు వరకూ ఎలాంటి ప్రకటనలూ ఇవ్వకపోవడంతో రైతులకు సమాచారం లేక పత్తి లోడ్లతో సీసీఐ సెంటర్లకు వస్తున్నారు. తీరా రైతులు వచ్చాక ఒకటి రెండు రోజులకు కొనుగోళ్లను నిలిపి వేస్తున్నట్లు చెప్పడంతో ఎక్కడ అమ్ముకోవాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. చండూరుకు చెందిన ఓ రైతు అక్కడి అధికారుల సూచన మేరకు మునుగోడు ప్రాంతంలోని పత్తి మిల్లుకు వెళ్లగా, అక్కడా కొనుగోళ్లు నిలిపేసినట్లు చెప్పారు. చిట్యాలకు వెళ్లాలని సూచించడడంతో ఆ రైతు ఇక్కడికి వచ్చాడు. గురువారం ఇక్కడ కూడా కొనుగోళ్లు ఆపేసినట్లు చెప్పడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ఇలా ఒక్కసారిగా కొనుగోళ్లను బంద్ పెట్టడంతో ఆగ్రహించిన రైతులు గురువారం చిట్యాల బస్టాండ్ సమీపంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్కడి చేరుకుని ఆందోళన విరమింపజేసే క్రమంలో రైతులు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం సీఐ నాగరాజు, ఎస్ఐ ధర్మా రైతులతో కలిసి సీసీఐ కొనుగోలు కేంద్రం వద్దకు చేరుకుని అక్కడి అధికారులతో చర్చలు జరిపారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, తాసీల్దార్ క్రిష్ణ, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి జానయ్య మాట్లాడడంతో ఎట్టకేలకు సాయంత్రానికి కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న పత్తి లోడ్లను సీసీఐ అధికారులు మిల్లులోకి పంపించారు.

**రెండ్రోజులు ఆపి ఇయ్యాల కొనుగోళ్లు బంద్ అంటున్నరు**



మా నాన్న అనారోగ్యంతో ఉన్నాడు. మేము ముగ్గరం ఆడ పిల్లలం. మా పత్తిని అమ్మడానికి రెండు రోజుల కింద చిట్యాలకు వచ్చి ట్రాక్టర్ దగ్గరే ఉంటున్నాను. ఈ రోజు కొనుగోళ్లను నిలిపివేసినట్లు సీసీఐ అధికారులు చెప్పారు. ట్రాక్టర్ కిరాయి రూ.4 వేలు. పత్తి అమ్మితే వచ్చిన డబ్బులు మా నాన్న వైద్యానికి ఉపయోగపడుతాయి అనుకున్నాను. ఇప్పుడేం చేయాలో తెలియడం లేదు. గత ప్రభుత్వంలో ఇలా లేదు.

**-బక్క మమత**

**ఇట్ల జనవరిలో ఎప్పుడూ బంద్ పెట్టలే**



పత్తి తీసుకుని చిట్యాలలోని సీసీఐకి వచ్చిన. రెండు రోజుల నుంచి ఇక్కడే ఉన్నం. తీరా ఇప్పుడు పత్తి కొంటలేం అంటున్నారు. ఇది రైతుల మోసం చేయడమే. జనవరిలోనే ఎప్పుడూ కొనుగోళ్లు బంద్ పెట్టలేదు. పత్తి బాగా లేదని సాకులు చెప్తున్నరు. బాగాలేకపోతే తక్కువ ధర ఇచ్చి అయినా కొనాలే గానీ, అసలు కొనం అంటే రైతులు ఎక్కడ అమ్ముకోవాలి.

**-దాసరి స్వామి, రైతు**

## నకిరేకల్ బైపాస్‌లో కత్తులతో దాడి

- ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఐదుగురిపై కేసు

నకిరేకల్, జనవరి 9 : పదకొండు వేల రూపాయల అప్పులు ఇద్దరి ప్రాణాల మీదికి తీసుకువచ్చింది. నకిరేకల్ బైపాస్ రోడ్డులో కత్తులతో జరిగిన దాడి కలకలం రేపింది. సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన సంజయ్‌భార్గవ్, నకిరేకల్‌కు చెందిన ప్రేమ్‌కుమార్, నాగస్వామి మూసీ పరివాహక ప్రాంతంలో చేపలు పట్టి జీవనం గడుపుతుంటారు. నాగస్వామికి ప్రేమ్‌కుమార్ రూ.11 వేలు ఇవ్వాల్సి ఉంది. కిందటి నెల పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టగా, జనవరి రెండున ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నారు. వారం దాటినా ప్రేమ్‌కుమార్ డబ్బులు ఇవ్వకపోవడంతో నకిరేకల్ బైపాస్‌లో మాట్లాడుకుందామని అతడిని నాగస్వామి పిలిపించాడు. సంజయ్‌భార్గవ్, ప్రేమ్‌కుమార్ బైక్‌పై వచ్చారు. నాగస్వామితోపాటు క్రాంతి, వెంకన్న, అజయ్, ఉదయ్ వచ్చారు. మాట్లాడుకునే సమయంలో ఘర్షణ జరగ్గా.. నాగస్వామి వెంట వచ్చిన వ్యక్తులు సంజయ్‌భార్గవ్, ప్రేమ్‌కుమార్‌పై కత్తులతో దాడి చేశారు. ఘర్షణ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేసుకుని అపస్మారక స్థితిలో ఉన్న సంజయ్‌భార్గవ్, ప్రేమ్‌కుమార్‌ను నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నాగస్వామితోపాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.

# మినీ ట్యాంక్ 'బంద్'

## భువనగిరి, బీబీనగర్ చెరువుల సుందరీకరణేది?

- బీఆర్‌ఎస్ సర్కారులో రూ.17 కోట్లతో శంకుస్థాపన
- అసెంబ్లీ ఎన్నికల కోడ్‌తో పెండింగ్
- కాంగ్రెస్ పాలనలో ఏడాది దాటినా ముందుకు పడని పనులు
- కలగానే రివర్ వ్యూ పార్కులు, వ్యూ పాయింట్లు

**ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు ఉద్దేశించిన చెరువుల సుందరీకరణ పనులకు మోక్షం లభించడం లేదు. భువనగిరి మినీ ట్యాంక్ బండ్‌ను మరింత అభివృద్ధి చేయడంతోపాటు బీబీనగర్ చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దకుండా కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసింది. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పట్టించుకోవడం లేదు. దాంతో రివర్ వ్యూ పార్కులు, వ్యూపాయింట్లు వంటి సుందీరకణ పనులు కలగానే మిగిలిపోయాయి.**

– యాదాద్రి భువనగిరి, జనవరి 9 (నమస్తే తెలంగాణ)



బీబీనగర్ చెరువు

బీఆర్‌ఎస్ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రాన్ని ఆధ్యాత్మిక ప్రపంచం అబ్బురపడేలా పునర్నిర్మించగా, స్వామివారి దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో గుట్ట మార్గంలో ఉన్న భువనగిరి, బీబీనగర్ చెరువులను పర్యాటక కేంద్రాలను తీర్చిదిద్దాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంకల్పించింది. హైదరాబాద్ మహానగరానికి చేరువగా, వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిని ఆనుకొని ఉండడంతో పర్యాటకులు, పట్టణ ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని భావించింది. సుందీకరణ పనుల బాధ్యతను హెచ్‌ఎండీఏకు అప్పగించింది. దాదాపు రూ.17 కోట్లతో భువనగిరి, బీబీనగర్ చెరువుల బ్యూటిఫికేషన్ చేపట్టాలని నిర్ణయించింది. హైదరాబాద్‌లో జంట నగరాలను కలిపే ట్యాంక్ బండ్ తరహాలో రెండు చెరువుల వద్ద పనులు చేపట్టాలని భావించింది. ఆ మేరకు అప్పటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి గతేడాది ఆగస్టులో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ–ప్రొక్యూర్ టెండర్లు కూడా ఆహ్వానించారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు ఆగిపోయాయి.

**ఏడాదైనా పట్టింపేది?**

అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ భువనగిరి, బీబీనగర్ సుందీకరణ పనులు చేపడుతుందని అంతా భావించారు. కానీ, వచ్చి ఏడాది దాటినా పట్టించుకోవడం లేదు. తొలుత భువనగిరిలో కొంత మేర పనులు ప్రారంభమైనా ఆ తర్వాత ఆగిపోయాయి. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతోనే పనులు ముందుకు సాగడం లేదని బీఆర్‌ఎస్ నాయకులు చెబుతున్నారు. కొన్ని రోజుల క్రితం బీబీనగర్ చెరువును ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సందర్శించారు. ప్రస్తుతం ఉన్న నిధులు సరిపోవని చెప్తూ రెట్టింపు నిధులు తీసుకొస్తానని ప్రకటించారు. కానీ ఇప్పటి వరకూ అడుగు ముందుకు పడలేదు.

**కలగానే సుందరీకరణ పనులు..**

బీబీనగర్ చెరువు సుమారు కిలోమీటన్నర ఉంటుంది. నిత్యం నీళ్లు ఉండడంతో నిండుకుండలా కనిపిస్తుంది. హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో చెరువు కట్టను బలోపేతం చేయాలని బీఆర్‌ఎస్ సర్కారులో భావించారు. చెరువు సుందరీకరణలో భాగంగా రూ.6కోట్లతో ఫ్లోరింగ్, రెయిలింగ్, గార్డెనింగ్, రెండు వైపులా ప్లాట్‌ఫారాలు, వాకింగ్ ట్రాక్, కుర్చీలు, టన్నెల్ తదితర పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. చెరువు పొడవునా హైమాస్ట్ లైటింగ్, చుట్టూ గ్రీనరీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. కట్ట కింద చెరువు చుట్టూ 30 ఫీట్ల బీటీ రోడ్డు నిర్మించాలనుకున్నారు. ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా భువనగిరిలో ఉన్నట్లు ఎత్తయిన జాతీయ జెండా, లవ్ బీబీనగర్ సింబల్ ఏర్పాటు చేయాలని భావించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో అవేవీ అమలుకు నోచడం లేదు. ఇక భువనగిరి చెరువు కొంతమేర మినీ ట్యాంక్‌బండ్‌గా రూపుదిద్దినప్పటికీ పర్యాటకులను ఆకర్షించేందుకు మరో రూ.11కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. రివర్ వ్యూ పార్కులు, వ్యూ పాయింట్లు వంటి పనులు కలగానే మిగిలిపోయాయి.

**చెరువుల సుందరీకరణ పనులు చేపట్టాలి**



బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో భువనగిరి చెరువు సుందరీకరణ పనులు చేపట్టాం. ఆ తర్వాత పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు హెచ్‌ఎండీఏ నిధులు తీసుకొచ్చాం. అప్పటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి శంకుస్థాపన కూడా చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు పెండింగ్‌లో పడ్డాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సుందరీకరణ పనుల ఊసే ఎత్తడం లేదు. ఎమ్మెల్యే కుంభం చొరవ తీసుకుని పనులు చేయించాలి.

**- ఎనబోయిన ఆంజనేయులు, మున్సిపల్ మాజీ చైర్మన్**